క్లుప్తంగా

బాల్య వివాహాలు అనర్థం



సమావేశంలో మాట్లాడుతున్న మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ

పెనుగంచిప్రోలు: బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ తెలిపారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయ ఆవరణలో గురువారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా తల్లులకు, కిశోర బాలికలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆడపిల్లల సంరక్షణ కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో అన్నదానం

నందిగామ: పట్టణ శివారు రామలింగేశ్వర నగర్ లోని సాయిబాబా ఆలయంలో గురువారం స్వామివారికి విశేష పూజలు జరిగాయి. వేకువజామునే పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేష పూజలు జరిగాయి. ఆ తర్వాత పల్లకి సేవ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ప్రత్యేక పూజలతో పాటు పలు సంధ్యలలో ప్రత్యేక హారతులిచ్చారు. ఆయా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మండలంలో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

పెనుగంచిప్రోలు: మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులు లేని వారు, మార్పులు, చేర్పులు కావాల్సిన వారు, పిల్లల వేలిముద్రలు అప్‌డేట్ చేయించుకోవాల్సినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెనుగంచిప్రోలులోని కేవీఆర్ జెడ్పీ హైస్కూల్, నవాబుపేటలోని ఆర్‌సీఎం పాఠశాలలో ఈనెల 20, 21, 23, 24 తేదీల్లో ఈ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ పరిశీలన

నందిగామ: పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థితి మెరుగుదలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణ పరిధిలోని పలు వార్డులలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను గురువారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి రోజూ డ్రైయిన్లలో పూడిక తీయిస్తున్నామని, అవసరమైన చోట్ల డ్రైయిన్లు నిర్మిస్తూ, మురుగు నీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని క్రిస్టియన్ పేటకు చెందిన రుంజ నాగయ్య కొంతకాలంగా అనారోగ్యంతో ఉంటూ ఈనెల 15 వ తేదీన మృతి చెందాడు. ఈ సందర్భంగా వైఎస్సార్ బీమా పథకంలో మట్టి ఖర్చుల కింద మంజూరైన రూ.10 వేలను గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మృతుని భార్య హైమావతికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పిడతల జయరాజు, సచివాలయం కన్వీనర్ సురేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఇన్నమ్మ, వలంటీర్ శ్యామ్ పాల్గొన్నారు.

చిల్లకల్లు ఎస్‌ఐగా దుర్గాప్రసాద్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ దుర్గాప్రసాద్

చిల్లకల్లు(జగ్గయ్యపేట అర్బన్): జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు ఎస్‌ఐగా కందుల దుర్గాప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎస్‌ఐగా పని చేస్తున్న సీహెచ్ చిన బాబు ఏలూరు డివిజన్‌కు రిపోర్ట్ చేయగా, కృష్ణాజిల్లా కూచిపూడి ఎస్‌ఐగా పనిచేస్తున్న దుర్గాప్రసాద్‌ను చిల్లకల్లు ఎస్‌ఐగా నియమిస్తూ విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడటంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గతంలో తనకు ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన అనుభవం ఉందని, అన్ని వర్గాలకు న్యాయం చేస్తానన్నారు.

ప్రత్యేక హోదా కావాలని కోరుతూ నేడు పాదయాత్ర

కంచికచర్ల: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రత్యేకహోదా తోనే సాధ్యమని అందుకే పాదయాత్ర చేస్తున్నానని, హైకోర్టు న్యాయవాది, తెలుగు రాష్ట్ర సమితి వ్యవస్థాపకుడు జై భీమ్ శ్రీనివాస్ అన్నారు. కంచికచర్లలో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రత్యేకహోదా కావాలని శుక్రవారం ఉదయం 7 గంటలకు కంచికచర్ల నుంచి కీసర, ఐతవరం, అంబారుపేట మీదుగా నందిగామ వరకు జాతీయ రహదారిపై పాదయాత్ర చేయనున్నట్టు తెలిపారు. ఈ పాదయాత్ర పార్టీలకు అతీతంగా చేస్తున్నానని, ప్రతి ఒక్కరూ మద్దతు తెలియజేయాలని కోరారు.

వ్యవసాయాన్ని పండగ చేసిన సీఎం జగన్

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను



సహకార సంఘ భవన ప్రారంభోత్సవంలో ప్రభుత్వవిప్ ఉదయభాను, పక్కన కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు

గోపినేనిపాలెం(పెనుగంచిప్రోలు): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండుగ చేశారని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. వత్సవాయి మండలం గోపినేనిపాలెం గ్రామంలో రూ.17.65 లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహకార సంఘాల్లో సభ్యులైన రైతుల పిల్లల విదేశీ విద్యకు రూ.40 లక్షల వరకు రుణాలు ఇస్తారన్నారు. జగనన్న పాలనలో వ్యవసాయం, సహకార రంగం బలోపేతం అయ్యాయన్నారు. రైతులకు ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులతో పాటు వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, విలువైన సూచనలు సలహాలు ఇస్తున్నారన్నారు. గిట్టుబాటు ధరతో పాటు పంట నష్టపోతే నష్టపరిహారం వెంటనే ఇస్తున్న ఘనత తమ ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, జగ్గయ్యపేట మార్కెట్ యార్డు చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసుపోగు దేవమణి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, సర్పంచ్ బి.శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు తేజావతు హుస్సేని, వైఎస్సార్‌సీపీ మండల, గ్రామ పార్టీ అధ్యక్షులు గాదెల రామారావు, కామినేని రవి రాంబాబు, నాయకులు సామినేని లక్ష్మీనారాయణ, చింతకుంట్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే కోచింగ్ సెంటర్ ఏర్పాటు

అభ్యర్థులకు హాల్ టికెట్‌లు అందజేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



హాల్ టికెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: ఈ ప్రాంతానికి చెందిన నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే తపనతోనే ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువత కోసం స్థానిక ఓసీ క్లబ్‌లో కస్తాల మరియమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తమ సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ గురువారంతో ముగిసింది. ముందుగా దరఖాస్తుదారులకు హాల్ టికెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు, అరుణకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం ఉన్న కుటుంబం ఎలా ఉంటుందో తమకు తెలుసన్నారు. తమ తల్లి ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తూ తమను ఉన్నత చదువులు చదివించి ఇంత వారిని చేశారని గుర్తు చేశారు. లక్షలు ఖర్చు పెట్టినా దొరకని వసతులతో భోజనం, స్టడీ మెటీరియల్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన పీజేఆర్ కోచింగ్ సెంటర్ అధ్యాపకులతో కోచింగ్ అందించామని చెప్పారు. కోచింగ్ సెంటర్ నిర్వహణలో ఏ విషయంలోనూ రాజీ పడలేదని యువతకు అవసరమైన అన్ని వసతులు కల్పించామని తెలిపారు. అనంతరం కోచింగ్ సెంటర్ నిర్వహణలో భాగస్వాములైన వాసుదేవరావు, నరేంద్ర, సిబ్బంది జరీనా, రమేష్, గాంధీలతో పాటు కోచింగ్ సెంటర్ నిర్వహణకు క్లబ్ వినియోగించుకోమని చెప్పిన చిరుమామిళ్ల చైతన్య కుమార్, ఆవుల రాములును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ జయరాం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కోవెలమూడి వెంకట నారాయణ, నాయకులు దాసు, అచ్చి చిన్నబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

కంచికచర్ల: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హతగల వారికందరికీ అందేలా చూడాలని డాన్‌బాస్కో నవజీవన్ సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రాఘవ కిరణ్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఈటీసీ సెంటర్ ఉపాధ్యాయులు, వలంటీర్లకు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ఆధార్ కార్డులేని వారిని గుర్తించి వారికి ఆధార్‌కార్డు వచ్చేలా చూడాలని, ప్రతి ఒక్కరికీ ఈకేవైసీ చేయించాలన్నారు. ముఖ్యంగా పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుందన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్చేలా చూడాలన్నారు. గ్రామాల్లోని ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వ అధికారులకు తెలియజేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటుపడకుండా ఉండేందుకు వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ మేరుగ రత్నం, ఈటీసీ సెంటర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన

పెద్దాపురం(వీరులపాడు): రహదారి భద్రతా నియమాలు పాటించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్‌ఐ సోమేశ్వరరావు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా మండలంలోని పెద్దాపురం గ్రామ శివారులో గురువారం ఆయన ఆటో, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. ముఖ్యంగా ఆటోవాలాలు పరిమితి మేరకే ప్రయాణికులను ఎక్కించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు రహదారి నిర్మాణ పనులకు భూమి పూజ

నందిగామ: స్థానిక రామలింగేశ్వర నగర్ లో గల అయ్యప్ప ఆలయం ఎదురుగా గల రహదారి నిర్మాణ పనులకు శుక్రవారం భూమి పూజ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ డాక్టర్ జయరాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహన రావు, నగర పంచాయతీ చైర్ పర్సన్ మండవ వరలక్ష్మి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. చందర్లపాడు రోడ్డు విస్తరణ పనుల కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం ఉదయం 9 గంటలకు స్థానిక చిల్లకల్లు రోడ్‌లోని శుభమస్తు కల్యాణమండపంలో జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధులు గురువారం తెలిపారు. పార్టీ ముఖ్య నాయకులు, గ్రామ సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, పట్టణ కౌన్సిలర్లతో నిర్వహించే ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

పేట ఆర్టీసీ డిపోకు రికార్డు స్థాయిలో ఆదాయం



డీఎం ప్రసాద్

జగ్గయ్యపేట అర్బన్: సంక్రాంతి పండుగ సందర్భంగా జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో పరిధిలో పలు ప్రత్యేక బస్సు సర్వీసుల ద్వారా అత్యధిక ఆదాయం సాధించినట్లు డిపో మేనేజర్ ఎంపీ ప్రసాద్ గురువారం తెలిపారు. దాదాపు 34 ప్రత్యేక బస్సు సర్వీసులు నడపడం ద్వారా రూ.19 లక్షలు ఆదాయం సాధించినట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి జగ్గయ్యపేటకు, జగ్గయ్యపేట నుంచి హైదరాబాద్‌కు నడిపి రూ.5.75 లక్షల ఆదాయం సాధించిందని, ఈనెల 18 వ తేదీన డిపో అత్యధిక ఆదాయం రూ.15.46 లక్షలు సాధించిందని, ఖమ్మంకు 15 స్పెషల్ బస్సులతో కలుపుకొని మొత్తం రూ.19 లక్షల ఆదాయాన్ని పొందినట్లు తెలిపారు. ఇది జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో చరిత్రలో ఇప్పటివరకు సాధించిన అత్యధిక ఆదాయం అని తెలిపారు. ఇంతటి ఆదాయం సాధించడానికి కృషిచేసిన ప్రతి ఒక్క సిబ్బందికి పేరు పేరున డీఎం అభినందనలు తెలిపారు. సిబ్బంది ఇదే రీతిగా కృషిచేసి డిపోను మరింత అభివృద్ధి పథంలో పయనించటానికి తోడ్పడవలసిందిగా కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో బాలికా దినోత్సవం



పేరకలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీఓ లక్ష్మీభార్గవి

కంచికచర్ల: మండలంలోని పేరకలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జాతీయ బాలికా దినోత్సవంలో భాగంగా బాలికలను చదివిద్దాం, బాలికలను రక్షిద్దాం అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీ భార్గవి పాల్గొని మాట్లాడారు. బాలికలు వివిధ వృత్తి నైపుణ్యాలను నేర్చుకుని అన్ని రంగాలలో ముందుకు సాగాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని, బాల్య వివాహాలు చేయరాదన్నారు. చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేయటం వల్ల బాలికల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిని అనారోగ్యం పాలవుతారన్నారు. బాలికా విద్యను ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, షేక్ కరీమా, షేక్ తారాబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.నలువరాణి, పుష్ప బాలికలు, చిన్నారులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికే జేసీఎస్ కన్వీనర్ల నియామకం



సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న జగనన్న సచివాలయ కోఆర్డినేటర్ కందుల రవీందర్ రెడ్డి, సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు

గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల జేసీఎస్ కో–ఆర్డినేటర్ కందుల

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకే జేసీఎస్ కన్వీనర్లను నియమిస్తున్నట్లు గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల జేసీఎస్ కో–ఆర్డి నేటర్ కందుల రవీంద్రరెడ్డి తెలిపారు. కింది స్థాయి కార్యకర్త నుంచి నేరుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సంబంధాలు కలిగి ఉంటారన్నారు. రానున్న రోజుల్లో వలంటీర్లు, గృహ సారథులు, ప్రజలకు మధ్య జేసీఎస్ మండల కన్వీనర్లు వారధుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. గురువారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని నియోజకవర్గాలకు సంబంధించి జగనన్న సచివాలయ కన్వీనర్ (జేసీఎస్) సమావేశం జరిగింది. గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల జేసీఎస్ కో–ఆర్డినేటర్ కందుల రవీంద్రరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, మల్లాది విష్ణు, వసంత కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీలు ఎండీ రుహుల్లా, మొండితోక అరుణ్‌కుమార్, తూర్పు నియోజకవర్గ సమన్వయ కర్త దేవినేని అవినాష్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ తాతినేని పద్మావతి, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్(బుజ్జి), సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకల్లు నరసింహారావు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, నూతనంగా నియమితులైన జేసీఎస్ కన్వీనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ జేసీఎస్ కన్వీనర్ల విధులను వివరించారు. వలంటీర్లు, గృహ సారథులతో కలిసి సమన్వయంగా జేసీఎస్ మండల కన్వీనర్లు ముందుకు సాగాలన్నారు. జేసీఎస్ కన్వీనర్లు వారికి కేటాయించిన ప్రతి పనిని బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. ప్రతి అంశంలో జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమాచారాన్ని అందిపుచ్చుకుంటూ పార్టీ ఆదేశాలను స్పష్టంగా పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యమంత్రి నుంచి వచ్చే సమాచారాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాల్సిన బాధ్యత జేసీఎస్ కన్వీనర్లపై ఉందన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి

రీజినల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జేసీఎస్ కన్వీనర్లపై గురుతర బాధ్యతను పెట్టారన్నారు. గృహ సారథుల నియామకంలో జేసీఎస్ కన్వీనర్లు ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలని కోరారు. అందరినీ కలుపుకుని, ప్రతి అంశాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో మన పార్టీ ఎమ్మెల్యేలను గెలిపించడం ద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా ప్రారంభమైన ఉరుసు ఉత్సవాలు

నందిగామ: పట్టణ శివారు చందాపురం సమీపంలో గల హజరత్ సయ్యద్ బాలే మస్తాన్ షా వలి దర్గా ఉరుసు ఉత్సవాలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలలో భాగంగా మొదటిరోజు పట్టణంలో గంధం ఊరేగింపు జరిగింది. మత పెద్దల ప్రార్థనలతో ఈ కార్యక్రమం కొనసాగింది. అనంతరం దర్గా వద్ద ప్రత్యేక నమాజ్‌లు జరిగాయి.ఈ వేడుకలకు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ హాజరై ప్రత్యేక నమాజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. దర్గా కమిటీ అధ్యక్షుడు షేక్ పితాన్, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



కంచికచర్లలో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కంచికచర్ల 16వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఏడవరోజు గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే పాదయాత్రతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, ఆర్బీకే సెంటర్లు, మన బడి నాడు నేడు, లక్షల సంఖ్యలో ఇళ్ల పట్టాల పంపిణీ, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం, జగనన్న మోడల్ కాలనీలు, అమ్మ ఒడి, విద్యా దీవెన, ఉన్నత కులాల్లోని నిరుపేదలకు ఆర్థిక సాయం అందించడం, ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. కార్యక్రమంలో సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, మాజీ ఎంపీపీ పాటిబండ్ల హరిజగన్నాధరావు, నాయకులు నారిశెట్టి శ్రీనివాసరావు, వంగా శ్రీనివాసరావు, దాసరి రాజా, వేల్పుల శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రవాణా శాఖ నిబంధనలపై అవగాహన అవసరం



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీవో పద్మావతి

నందిగామ: రవాణా శాఖ నిబంధనలపై వాహన చోదకులకు కనీస అవగాహన కలిగి ఉండాలని ఆర్టీవో ఎం.పద్మావతి సూచించారు. పట్టణంలోని ఆర్టీవో కార్యాలయ ఆవరణలో గురువారం వాహన చోదకులకు రవాణా శాఖ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరి వద్ద లైసెన్స్ తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని రికార్డులను వెంట ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇటీవల ప్రమాదం జరుగుతున్న వాహనాలలో ఎక్కువ శాతం మంది యువతే ఉంటున్నారని, ఈ ప్రమాదాలన్నీ మితిమీరిన వేగం కారణంగానే జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.ఎట్టి పరిస్థితుల్లో కూడా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపవద్దన్నారు.కార్యక్రమంలో ఎంవీఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గాంధీ, పక్కన ఎంపీడీఓ ప్రసాద్ తదితరులు

పెనుగంచిప్రోలు: సచివాలయ ఉద్యోగులు సమర్థంగా పనిచేయాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సర్వేలను సత్వరం పూర్తి చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ సర్వేలను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు కార్డులు అందజేయాలన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించటంతో పాటు బాధ్యతగా పనిచేయాలన్నారు. కొందరు విధుల్లో అలసత్వం వహిస్తున్నారని, వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్ మాట్లాడుతూ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ప్రతిరోజూ 15 సేవలను పూర్తి చేయాలన్నారు. కరెంట్ బిల్లులు, ట్రైన్, బస్ టికెట్లు వంటి సేవలు కూడా చేయవచ్చన్నారు. ఉద్యోగులు తప్పనిసరిగా ఉదయం 10 గంటల లోపు సాయంత్రం గం.5.30 నిముషాలకు అటెండెన్స్ చూపించాలన్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు చేసుకోవటానికి ప్రస్తుత ప్రభుత్వం అవకాశం కల్పించిందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సిద్దారెడ్డి, ఈఓపీఆర్‌డీ వీరభద్రరావు, గ్రామ కార్యదర్శులు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేమన పద్యాల పోటీలు



వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ దేవి, ఎంపీటీసీ సభ్యుడు కనగాల తదితరులు

కొణకంచి(పెనుగంచిప్రోలు): చిన్నతనం నుంచే విద్యార్థులు వేమన శతకాలను తెలుసుకోవాలని, అందులోని నీతిని గ్రహించాలని సర్పంచ్ గోనెల దేవి తెలిపారు. యోగి వేమన జయంతి సందర్భంగా గురువారం స్థానిక బాలభక్త గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వేమన పద్యాలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కనగాల శ్రీనివాసరావు, ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి కె.వాణి, గ్రంథాలయాధికారి ఎ.రామచంద్రుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వేమన జయంతి

నందిగామ: మండలంలోని పల్లగిరి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం యోగి వేమన జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వేమన పద్య పఠనం పోటీలు నిర్వహించారు. అనంతరం వేమన చరిత్రపై లఘు నాటిక ప్రదర్శించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

ఎంవీఐ చల్లారావు



గరికపాడు చెక్‌పోస్ట్ వద్ద డ్రైవర్లు, వాహనదారులకు కరపత్రాలు అందజేస్తున్న ఎంవీఐ చల్లారావు, సిబ్బంది

గరికపాడు(జగ్గయ్యపేట అర్బన్): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ బండారు చల్లారావు తెలిపారు. 34 వ రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా గురువారం మండలంలోని గరికపాడులో ఉన్న సరిహద్దు ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ సిబ్బందితో కలిసి డ్రైవర్లు, ప్రయాణికులకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడపరాదని, అతి వేగం ప్రమాదకరమని,సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాన్ని నడపరాదని, సీట్ బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలంటూ అవగాహన కల్పించారు. చెక్‌పోస్ట్ ఇన్‌చార్జ్ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, ఏఎంవీఐ పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం తీసుకునే భద్రతా చర్యలను ప్రతి ఒక్కరూ పాటించాలని సీఐ ఎ.నాగమురళి అన్నారు. స్థానిక రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణ ఎంవీఐ ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో రోడ్డు భద్రత వాల్ పోస్టర్లను సీఐ నాగమురళి, పేట ఎస్‌ఐ బీవీ రామారావు ఆవిష్కరించారు.